తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
17-05-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 103
PUBLISHED FROM HYDERABAD  పేజీలు-8  వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice  వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## సీనియర్లకు పదవి గండం..! కొత్త ముఖాలకు మంత్రి యోగం..?

- జూపల్లి స్థానంలో మరో వెలమ నేతకు అవకాశం
- కొండా, పొన్నంకు ఉద్వాసన ప్రచారం
- కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చలు

**హైదరాబాద్:**
రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ పార్టీలో విస్తృత చర్చ సాగుతోంది. కొందరు సీనియర్ మంత్రులను తప్పించి కొత్త వారికి అవకాశం కల్పించే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానంలో మరో వెలమ సామాజిక

మిగతా 2వ పేజీలో..

## ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ధరల పెంపుతో ప్రజలపై భారం మోపవద్దు

2

# రక్షణ సేన గట్టెక్కేనా?!




### కమలం.. కాంగ్రెస్.. కారు.. నడుమ కవిత పార్టీ

- 2029 టార్గెట్ రీచ్ అవ్వడం సాధ్యమేనా?
- 'టీఆర్ఎస్' పేరుతో కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయం
- తండ్రి కేసీఆర్ ఇమేజ్‌ను కాదని.. కూతురు సాధించే మైలేజ్ ఎంత?
- 2034 వరకు నేనే సీఎం అంటున్న రేవంత్ రెడ్డి
- తెలంగాణ గడ్డపై 'బెంగాల్ వ్యూహం' సిద్ధం చేస్తున్న బీజేపీ
- ముక్కోణపు పోటీలో టీఆర్ఎస్ మనుగడ సాధ్యమేనా?
- రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా కవిత పార్టీ
- సొంత క్యాడర్ తయారు చేసుకునేనా.. పార్టీల ఓట్లు చీల్చేనా?

**ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్**
తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ ఊహించని మలుపులు తిరుగుతుంటాయి. మొన్నటివరకు తండ్రి నీడలో, బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా ఉన్న కల్వకుంట్ల కవిత.. ఇప్పుడు సొంతంగా 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఒకప్పుడు తెలంగాణను ఊపేసిన 'టీఆర్ఎస్' అనే సెంటిమెంట్ అక్షరాలనే తన పార్టీ పేరును దక్కించుకోవడంలో ఆమె సఫలమయ్యారు. పార్టీ ఆవిర్భావం రోజు ఆమె చేసిన ప్రసంగం, 'పాంచజన్యం' పేరిట ఇచ్చిన హామీలు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కుదుపు తీసుకువచ్చిన మాట వాస్తవమే. అయితే, 2029 ఎన్నికలే టార్గెట్‌గా, వెయ్యి రోజుల్లో కాంగ్రెస్‌ను గద్దె దించి తామే అధికారంలోకి వస్తామంటూ కవిత చేస్తున్న పదేపదే ప్రకటనలు.. ఇప్పుడున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఎంతవరకు సాధ్యమనే చర్చలు జోరందుకున్నాయి.

**తండ్రిని కాదని బిడ్డను జనాలు ఆదరిస్తారా?**
తెలంగాణ రాజకీయాల్లో 'తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ' అనే ముద్ర బలంగా ఉంది. దశాబ్దాల పాటు ఉద్యమాన్ని నడిపి, రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్

మిగతా 3వ పేజీలో..

## తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు శ్రీకారం



- వచ్చే నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం
- జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాలకు అవకాశం
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ

2

## మలక్‌పేట, ఉప్పుగూడ స్టేషన్లకు పూర్వ వైభవం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 16 :**
మలక్‌పేట్, ఉప్పుగూడ స్టేషన్లను గతంలో వేలాదిమంది ప్రజలు ఉపయోగించుకునే ముఖ్యమైన స్టేషన్లు. కాలక్రమేణా వాటి ప్రాధాన్యత తగ్గినా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆధునిక సదుపాయాలతో వీటిని పునరుద్ధరిస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మ□క్‌పేట ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లలో జరుగుతున్న ఆధునికీకరణ

మిగతా 2వ పేజీలో..



## మహిళల ఆర్థిక స్వావలంబనకు వేదిక స్త్రీ నిధి

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- స్త్రీ నిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం

**హైదరాబాద్, మే 16 :**
స్త్రీనిధి సంస్థ మన ఇల్లు వంటిది.. సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయి అని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ


మిగతా 2వ పేజీలో..




## ప్రధాని మోదీకి కవిత లేఖ

- బండి సంజయ్‌ను బర్తరఫ్‌కు డిమాండ్
- నిష్పక్షపాత దర్యాప్తు కోసం పదవి నుంచి తప్పించాలని విజ్ఞప్తి
- హోంశాఖలో కొనసాగితే విచారణపై ప్రభావం ఉంటుందనే ఆరోపణ
- ప్రజా విశ్వాసం కాపాడేందుకు తక్షణ నిర్ణయం అవసరమని వ్యాఖ్య
- కుమారుడిపై పోక్సో కేసు నేపథ్యంలో లేఖ రాసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

3



## 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'

- సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం
- 15 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు

**హైదరాబాద్, మే 16:**
సైబర్ నేరాలకు సిమ్ కార్డులు సరఫరా చేస్తున్న ముఠాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో దాడులు చేపట్టారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0' పేరుతో కొనసాగుతున్న ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్ సహా మొత్తం 15 రాష్ట్రాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాలకు ఉపయోగించే సిమ్ కార్డులను సరఫరా చేస్తున్న నెట్వర్క్‌లను గుర్తించిన పోలీసులు 10 మంది ఏజెంట్లను అరెస్ట్ చేశారు. అలాగే మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న

మిగతా 3వ పేజీలో..



## ఇంధన ధరలు తగ్గించాలని సీపీఐ నిరసన

- మోడీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్న కూనంనేని
- ఖాళీ సిలిండర్, ఆటో లాగుతూ వినూత్న ఆందోళన
- కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర విధానాలంటూ విమర్శ
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్
- హిమాయత్‌నగర్‌లో సీపీఐ భారీ నిరసన ప్రదర్శన

2

## వచ్చే ఏడాది చివరి నాటికి దేవాదుల పూర్తి చేయాలి

- అధికారులు, కాంట్రాక్టర్లకు మంత్రుల ఆదేశాలు
- రూ.18,400 కోట్లకు చేరిన ప్రాజెక్టు వ్యయం
- మరో రూ.3,978 కోట్లతో పనులు పూర్తి చేయాలని నిర్ణయం
- పనిచేయని కాంట్రాక్టర్లపై చర్యలకు హెచ్చరిక
- 10 జిల్లాల్లో 5.56 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- రాష్ట్ర సాగునీరు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

2



# ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ధరల పెంపుతో ప్రజలపై భారం మోపవద్దు
- ఎన్నికల హామీలకు విరుద్ధంగా కేంద్రం వైఖరి
- ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపడం తగదు



**తెలంగాణ బ్యూరో :**

దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెంపు నిర్ణయం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, ఈ ధరల పెంపు సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారంగా మారిందని పేర్కొన్నారు.

ఇరాన్ఇజ్రాయిల్ యుద్ధ పరిస్థితులను సాకుగా చూపుతూ ఇంధన ధరలు పెంచడం సరికాదని సీఎం స్పష్టం చేశారు. అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపి దేశ ప్రజలపై ఆర్థిక ఒత్తిడి మోపడం అన్యాయమన్నారు. ఎన్నికల ముందు ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల ఫలితాలు వచ్చిన కొద్ది రోజులకే నిర్ణయం మార్చుకోవడం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమేనని విమర్శించారు. ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకమని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై కూడా సీఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పదేళ్ల పాలనలో రూపాయి విలువ క్షీణించిందని, దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని ఆరోపించారు. 'ఆత్మనిర్భర్ భారత్' పేరుతో ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదని, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. యువత ఉపాధి అవకాశాలు తగ్గిపోతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పేర్కొంటూనే ప్రజలపై ఇంధన ధరల రూపంలో భారాన్ని మోపడం ఎలా సమర్థించుకుంటారని సీఎం ప్రశ్నించారు. ధరల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు శ్రీకారం

**హైదరాబాద్, మే 16:**

తెలంగాణలో ఓటర్ల జాబితాను సమగ్రంగా సవరించే ప్రత్యేక కార్యక్రమం వచ్చే నెల 15 నుంచి ప్రారంభం కానుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. దాదాపు పావు శతాబ్దం తర్వాత రాష్ట్రంలో ఈ విస్తృత స్థాయి ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఓటర్ల వివరాలను కచ్చితంగా నవీకరించడం, తప్పులను సరిదిద్దడం, అర్హులైన ప్రతి ఒక్కరిని జాబితాలో చేర్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారు. ప్రతి కుటుంబానికి ఎన్యూమరేషన్ ఫామ్‌లు అందజేస్తారు. ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు ఇవ్వబడతాయి. అందులో ఒకటి పూర్తి చేసి తిరిగి బీఎల్‌వోలకు అందజేయాలి. మరో ఫామ్‌ను రసీదు రూపంలో ఓటరు తమ వద్ద భద్రపరుచుకోవచ్చు. ప్రత్యక్ష ప్రక్రియతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు సదుపాయం కల్పించారు. ఓటర్లు voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంది. అందిన ఫామ్‌లు, నమోదు వివరాల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తారు. ఈ జాబితాను రాజకీయ పార్టీలకు అందించడంతో పాటు ప్రజల పరిశీలన కోసం అధికారిక వెబ్‌సైట్‌లో కూడా ఉంచనున్నారు. ముసాయిదా జాబితాపై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సవరణలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. అందిన ప్రతి అభ్యర్థనను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పెంచేందుకు ఈ సమగ్ర సవరణ కీలకమని అధికారులు భావిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా మారిన ఓటర్ల వివరాల తొలగింపు వంటి అంశాలు కూడా ఈ ప్రక్రియలో భాగమవుతాయి.

# నాకూ ఓ మంత్రి పదవి ఇవ్వండి

- రాహుల్‌ను కోరిని పరిగి ఎమ్మెల్యే

**న్యూఢిల్లీ, మే 16:**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిసినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ కేబినెట్‌లో మ□డు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని.. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేదని రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డీలిమిటేషన్‌లో భాగంగా జిల్లాలో 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 పార్లమెంట్ స్థానాలకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగానే తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు చెప్పారు. తమ కుటుంబం మ□డు తరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే పని చేస్తోందని.. బూత్ స్థాయి నుంచి తాను పని చేసినట్లు గుర్తు చేశారు. నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని.. పార్టీ అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి పదవి కోసం రాహుల్ గాంధీకి వినతి సమర్పించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనకు మంత్రి పదవి వచ్చేలా రాహుల్ గాంధీతో మాట్లాడి అవకాశం కల్పిస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# మలక్‌పేట, ఉప్పుగూడ స్టేషన్లకు పూర్వ వైభవం

**మొదటిపేజీ తరువాయి**

పనులను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పాత బస్తీ ప్రాంతంలో జరుగుతున్న రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులను పరిశీలించేందుకు మలక్‌పేట్, ఉప్పుగూడ రైల్వే స్టేషన్లను ఈరోజు సందర్శించాను.. పాత బస్తీ ప్రజలకు కూడా దేశంలోని ఇతర నగరాల స్థాయిలో రైల్వే సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం అని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా లిఫ్టులు, ఎస్కలేటర్లు, విస్తృతమైన ప్లాట్‌ఫారాలు, ప్లాట్‌ఫారం షెల్టర్లు, మెరుగైన పార్కింగ్, సర్క్యులేటింగ్ ఏరియా, ఆధునిక వెయిటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాను విద్యార్థిగా ఉన్న రోజుల నుంచే ఉప్పుగూడ, మలక్‌పేట్ స్టేషన్లను ప్రజలు ఎంతగా ఉపయోగించుకునేవారో చూశాను.. ఇప్పుడు మళ్లీ వాటికి పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది.. పాత బస్తీ ప్రజలు కూడా గర్వపడేలా ఈ స్టేషన్లను అందంగా, ఆధునికంగా తీర్చిదిద్దుతున్నాం అని ఆయన చెప్పారు. హైదరాబాద్ నగరంలో రైల్వే నెట్‌వర్క్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.. ఎంఎంటీఎస్ రెండో దశ పనులను వేగవంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం.. ఈ ప్రాజెక్టు ద్వారా నగర ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలు అందుతాయి.. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.. కొమురవెల్లి మల్లన్న భక్తులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు కొత్త కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను నిర్మించాం.. ఇప్పటికే 100 శాతం పనులు పూర్తయ్యాయి.. ఈ నెల చివరి వారంలో లేదా వచ్చే నెల మొదటి వారంలో ఆ స్టేషన్‌ను ప్రజలకు అంకితం చేయనున్నాం అని మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.720 కోట్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ స్టేషన్ రూపుదిద్దుకుంటోందని, అదేవిధంగా నాంపల్లి రైల్వే స్టేషన్‌ను కూడా రూ.350 కోట్లతో ఆధునీకరిస్తున్నామని, అక్కడ పనులు వేగంగా కొనసాగుతునాయని తెలిపారు. నగరంలో హఫీజ్‌పేట్, బేగంపేట్, నాంపల్లి, సికింద్రాబాద్, హైటెక్ సిటీ, మలక్‌పేట్, యాకుత్‌పురా, ఉప్పుగూడ, ఉమదానగర్, షాద్‌నగర్, మల్కాజిగిరి, మేడ్చల్ తదితర రైల్వే స్టేషన్లను ఒకేసారి ఆధునీకరించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సమాన అభివృద్ధి అందించడమే తమ లక్ష్యమన్నారు. రైల్వే మౌలిక వసతులు అభివృద్ధి చెందడం ద్వారా ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయన్నారు. ప్రజల సహకారంతో హైదరాబాద్ రైల్వే వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని కిషన్‌రెడ్డి చెప్పారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు వేదిక స్త్రీ నిధి

**మొదటిపేజీ తరువాయి**

సీతక్క అన్నారు. 2011లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీనిధి నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే స్త్రీ నిధిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు స్త్రీ నిధి ద్వారా 32 లక్షల మందికిపైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించడం గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో స్త్రీ నిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి ఉద్యోగులంతా కలిసి స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోగా మంత్రి సీతక్క అభినందించారు. సంఘం ఉద్యోగులను ఐక్యం చేయడమే కాక హక్కులతోపాటు బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ప్రయోజనాలతో పాటు లక్షలాది మహిళల ఆర్థిక సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. స్త్రీ నిధి అసలు సిసలు మాహిళా బ్యాంకు అని కొనియాడారు. రాష్ట్ర మహిళలకు స్త్రీ నిధి ఒక నమ్మకమైన బ్యాంకుగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్త్రీ నిధి మోడల్‌ను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు. "కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం. ఆ దిశగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది' అని మంత్రి తెలిపారు. దేశ జీడీపీలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 18 శాతానికే పరిమితమైందని, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 40 శాతానికి చేరుకుందని పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు కూడా ఆ స్థాయికి ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ముఖ్యంగా గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో 16 మంది ఉద్యోగులను తొలగించారని, ఇప్పుడు అదే వ్యక్తులు తప్పుడు ఆరోపణలతో సంస్థను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి అసత్య ప్రచారాన్ని ఉద్యోగులంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్త్రీ నిధిని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం తప్ప ఎవరి ఉద్యోగాలను తొలగించడం కాదు అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. స్త్రీ నిధి సంస్థ ఏర్పాటులో, దాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేసిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న విద్యాసాగర్ రెడ్డిని మంత్రి సీతక్క, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

నూతన నాయకత్వంలో స్త్రీ నిధి సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, స్త్రీ నిధి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీనియర్లకు పదవి గండం..! కొత్త ముఖాలకు మంత్రి యోగం..?

**మొదటిపేజీ తరువాయి**

వర్గ నేతకు అవకాశం ఇవ్వొచ్చన్న చర్చ వేడెక్కింది.

ఈ క్రమంలో చింతకుంట విజయ రమణారావు, మదన్ మోహన్ రావు, ప్రేమ్ సాగర్ రావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిలో ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్న విజయ రమణారావుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న ఆయనకు మంత్రి పదవి దక్కితే పెద్దపల్లి ప్రాంతానికి తొలిసారి మంత్రి వర్గంలో ప్రాధాన్యం లభించే అవకాశముందని చర్చ సాగుతోంది.

మరోవైపు నిజామాబాద్‌కు చెందిన మదన్ మోహన్ రావు పేరు కూడా బలంగా వినిపిస్తోంది. పార్టీకి జాతీయ స్థాయిలో సేవలు అందిస్తున్న నేపథ్యంలో ఆయనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మంచిర్యాలకు చెందిన ప్రేమ్ సాగర్ రావు పేరు కూడా ప్రచారంలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ విజయ రమణారావు, మదన్ మోహన్ రావుల మధ్యనే ఉందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఇక కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పేర్లు కూడా మంత్రి వర్గ మార్పుల చర్చల్లో వినిపిస్తున్నాయి. సీనియర్లను తప్పించి కొత్త వారికి అవకాశం ఇస్తే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్నవి కేవలం రాజకీయ ప్రచారాలేనని, అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు స్పష్టత రాదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఇంధన ధరలు తగ్గించాలని సీపీఐ నిరసన





**తెలంగాణ బ్యూరో:**

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు ఖాళీ సిలిండర్, ఆటోకు తాళ్లు కట్టి గుంజుతూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని అన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటూనే ప్రజలకు బంగారం కొనొద్దని, పెట్రోల్ వినియోగం తగ్గించాలని సూచించడం ఆర్థిక సంక్షోభానికి సంకేతమని పేర్కొన్నారు. ప్రజలను నిజాలు చెప్పకుండా అబద్ధపు ప్రచారాలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ, నాయకులు ప్రేమ్ పావని, ఛాయాదేవి, స్టాలిన్, కమతం యాదగిరి, వెంకటేశం, చంద్రమోహన్ గౌడ్, పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్, పల్లె నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది చివరి నాటికి దేవాదుల పూర్తి చేయాలి

**హైదరాబాద్:**

జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి 2027 డిసెంబర్ 31 నాటికి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర సాగునీరు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరిస్తూ, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు స్పష్టం చేశారు.

శనివారం సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టు పురోగతిపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టులలో ఒకటని పేర్కొన్నారు. గోదావరి నది నుంచి 38.16 టీఎంసీల నీటిని



తరలించి ఉత్తర, తూర్పు తెలంగాణలోని 10 జిల్లాల్లో 5.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

200405లో రూ.6,016 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం రూ.18,400 కోట్లకు చేరిందని మంత్రి వెల్లడించారు. భూసేకరణ, జీఎస్టీ మార్పులు, నిర్మాణ వ్యయాల పెరుగుదల, డిజైన్ సవరణల కారణంగా వ్యయం భారీగా పెరిగిందన్నారు. ఇప్పటివరకు రూ.14,422 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన పనుల కోసం మరో రూ.3,978 కోట్లు అవసరమవుతాయని చెప్పారు.

ప్రాజెక్టులో ఇప్పటివరకు 87.70 శాతం భౌతిక పురోగతి సాధించామని అధికారులు వివరించారు. ఆసియాలోనే అతిపొడవైన 49 కిలోమీటర్ల డిషేప్ టన్నెల్ ఇందులో భాగమని తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 పనులు చివరి దశకు చేరుకోగా, ఫేజ్ 3లో కీలక పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

ప్రాజెక్టుకు అవసరమైన 34,622 ఎకరాల్లో ఇప్పటికే 31,963 ఎకరాలు సేకరించామని, మిగిలిన 2,659 ఎకరాల భూసేకరణను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలను రద్దు చేసి వెంటనే రీటెండర్లు పిలవాలని స్పష్టం చేశారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీటితో పాటు వందల గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందుతుందని, దీనికి అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం ప్రభుత్వం పూర్తిగా అందిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# భగీరథ్ లొంగిపోయాడా..? పోలీసులే అరెస్ట్ చేశారా..?

**హైదరాబాద్, మే 16:**
మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ వ్యవహారంలో కొత్త సందిగ్ధత నెలకొంది. భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తొలుత వార్తలు రాగా, అనంతరం పోలీసులు ఆయనను తామే అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు.
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ చట్టానికి లోబడి తన కుమారుడిని న్యాయవాదుల సమక్షంలో పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. చట్టం అందరికీ సమానమని, న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు.
అయితే సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి మాత్రం పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌ను నార్సింగి వద్ద ఉన్న పోలీస్ అకాడమీ సమీపంలో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఆయనను పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. భగీరథ్ అరెస్టు నేపథ్యంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ హుటాహుటిన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మరోవైపు కేసు దర్యాప్తు కోసం సీఎం ఆదేశాల మేరకు డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.
ఒకవైపు కుమారుడిని స్వచ్ఛందంగా అప్పగించామని బండి సంజయ్ చెబుతుండగా, మరోవైపు అరెస్ట్ చేశామని పోలీసులు వెల్లడించడంతో భగీరథ్ లొంగిపోయారా లేదా పోలీసులు పట్టుకున్నారా అన్న అంశంపై స్పష్టత లేకుండా పోయింది.

# కుమారుడి లొంగుబాటుపై బండి సంజయ్ స్పందన

**హైదరాబాద్, మే 16:**
మైనర్ బాలికను వేధించారనే ఆరోపణలతో పోక్సో కేసు ఎదుర్కొంటున్న భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోవడంతో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నేపథ్యంలో కుమారుడి లొంగుబాటుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు.
అందరూ చట్టానికి లోబడి ఉండాల్సిందేనని పేర్కొన్న బండి సంజయ్, చట్టంపై ఉన్న గౌరవంతోనే తన కుమారుడు భగీరథ్‌ను న్యాయవాదుల సమక్షంలో పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అదే నమ్మకంతో చట్టపరమైన ప్రక్రియను ఎదుర్కొంటున్నామని చెప్పారు.
భగీరథ్ తాను ఎలాంటి తప్పూ చేయలేదని చెబుతున్నాడని బండి సంజయ్ వెల్లడించారు. కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించి తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రక్రియలో భాగంగానే లొంగుబాటులో కొంత జాప్యం జరిగిందని పేర్కొన్నారు. చట్టం నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశం తమకు లేదని, అందుకే అవసరమైన వివరాలతో పోలీసుల ముందుకు వచ్చినట్లు తెలిపారు.
కుమారుడిని చట్టం ముందు ప్రవేశపెట్టిన తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోతుందని, న్యాయస్థానాల్లో తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని బండి సంజయ్ అన్నారు.
మరోవైపు భగీరథ్ లొంగుబాటుతో కేసు దర్యాప్తులో పోలీసులు తదుపరి చర్యలను వేగవంతం చేశారు.

# 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'

**మొదటిపేజీ తరువాయి**
30 మందికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే రెండు విడతల్లో నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు సమకూరుస్తున్న వ్యక్తులు, వారికి సహకరిస్తున్న బ్యాంక్ సిబ్బందిపై పోలీసులు దృష్టి సారించారు. ప్రస్తుతం మూడో విడతలో సిమ్ కార్డుల సరఫరా వ్యవస్థను పూర్తిగా ఛేదించడంపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది.
పలు రాష్ట్రాల్లో ఇంకా సోదాలు కొనసాగుతున్నాయని, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

# పంట వ్యర్థాలను కాల్చడంతో ప్రతికూల ప్రభావం

- **రైతులకు అవగాహన కల్పించాలి**
- **వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి**

**హైదరాబాద్, మే 16:**
వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలే పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల భూసారం, పర్యావరణం మరియు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి తెలిపారు. తాత్కాలిక సౌలభ్యం కోసం పంట వ్యర్థాలను తగులబెట్టడం రైతులకు దీర్ఘకాలంలో ఆర్థిక నష్టాలను కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు వ్యవసాయ అధికారులు పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సంచాలకులు ఆదేశించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో పాటు రైతులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ప్రతి మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాల్లో పంట అవశేషాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అలాగే, పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చకుండా రోటావేటర్తో కలియదున్నడం, వేస్ట్ డీకంపోజర్ వినియోగం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించాలని రైతులను కోరారు.ల్గ□తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సుస్థిర వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని డా. బి. గోపి ఆకాంక్షించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**హైదరాబాద్, మే 16:**
ప్రజా పాలన `ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్‌లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమి□క్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్` తెలంగాణా థీమ్ తో రాష్ట్ర, జిల్లా కేంద్రాలలో 5ఐ రన్, అదేవిధంగా అన్నిమండల కేంద్రాలలో వ్యాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

# పోలీసులకు లొంగిపోయిన భగీరథ

**మొదటిపేజీ తరువాయి**
బండి సంజయ్ మాట్లాడుతూ..'నా కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు ఆరోపణలు వచ్చాయి. చట్టాలపై ఉన్న గౌరవంతో అడ్వకేట్ల ద్వారా పోలీసుల విచారణకు అప్పగించాను. నేను ఇంతకు ముందే చెప్పా.. చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టాలకి లోబడి ఉండాల్సిందే. మా అబ్బాయి ఏ తప్పూ చేయలేదని పదేపదే చెబుతున్నాడు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే స్టేషన్‌లో అప్పగిద్దామని అనుకున్నా. లాయర్లను సంప్రదించి మా వద్ద ఉన్న ఆధారాలను నా కుమారుడు వారి ముందుంచాడు. వాటిని చూసి కేసు కొట్టేస్తారని.. బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. అందుకే కొంత జాప్యం జరిగింది. ఈరోజు కూడా బెయిల్ వస్తుందనే లాయర్లు చెబుతున్నారు. అయితే ఇంకా జాప్యం చేయడం సరికాదని అనుకున్నా. ఆ ఉద్దేశంతో మా అబ్బాయిని తీసుకొచ్చి లాయర్ల ద్వారా విచారణ కోసం అప్పగించాను. న్యాయ వ్యవస్థపై సంపూర్ణమైన నమ్మకం ఉంది. సోమవారం నాడు కోర్టు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ.. న్యాయ వ్యవస్థపై ఉన్న గౌరవంతో ఇంకా ఆలస్యం కావొద్దని విచారణకు అప్పగించా' అని తెలిపారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉంది. నార్సింగ్ పోలీస్ అకాడవి□ సవి□పంలో భగీరథను అదుపులోకి తీసుకున్నామని చెబుతున్నారు. అక్కడి నుంచి అతడిని పేటబషీరాబాద్ స్టేషన్‌కు తరలించామని డిసిపి రమేశ్ రెడ్డి వెల్లడించారు.



# ప్రజలు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్నే తీసుకొస్తారు

- **కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ విమర్శలు**
- **ప్రత్యేక ఓటర్ల సవరణపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు**
- **దొంగ ఓట్లు, డబుల్ ఓట్లపై దృష్టి పెట్టాలని సూచన**
- **సనత్‌నగర్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు**
- **పార్టీ శ్రేణులు జాగ్రత్తగా వ్యవహరించాలని తలసాని సూచన**



**తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించి మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే అధికారంలోకి తీసుకువస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సనత్‌నగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని బీజేపీ దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా మార్చిందని ఆరోపించారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. తెలంగాణలో అలాంటి పరిస్థితులు రాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీ కేవలం సోషల్ మీడియాలో మాత్రమే కనిపిస్తోందని, సమాజంలో ఆ పార్టీ ప్రభావం పెద్దగా లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న దొంగ ఓట్లు, డబుల్ ఓట్లను గుర్తించి తొలగించేలా పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో కూల్చివేతలు తప్ప అభివృద్ధి కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి కనీస సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించలేకపోతోందన్నారు.
మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంపై పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.
జూన్ 1 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం పార్టీ కమిటీల ఏర్పాటు చేపడతామని తెలిపారు. సమావేశంలో తలసాని సాయి కిరణ్ యాదవ్, నామన శేషుకుమారి, కొలన్ లక్ష్మి, అత్తిలి అరుణ గౌడ్, మహేశ్వరి, ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఏల నియామకాలపై కాంగ్రెస్ ఫోకస్

- **ఎస్ఐఆర్ ప్రక్రియపై నేతలకు దిశానిర్దేశం**
- **జూమ్ సమావేశాల్లో టీపీసీసీ కీలక సూచనలు**
- **మండల కమిటీలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**
- **పార్లమెంట్ వారీగా నేతలతో సమీక్ష నిర్వహణ**

**తెలంగాణ బ్యూరో:**
బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాలు, ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ సంస్థాగత నిర్మాణంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ శనివారం జూమ్ సమావేశాలు నిర్వహించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాల్లో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.
పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నిర్వహించిన ఈ సమావేశాల్లో ప్రధానంగా బీఎల్ఏల నియామకాలపై చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రతి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని పూర్తి చేయాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతలకు సూచించారు.
ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నేతలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఏల జాబితాను డీసీసీల ద్వారా కలెక్టర్లకు అందించాలని ఆదేశించారు. అలాగే మండల అధ్యక్షుల నియామకాలను త్వరగా పూర్తి చేసి మండల కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు.
టీపీసీసీ చీఫ్‌తో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమావేశమైన ఆయన, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చించారు.
మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కోఆర్డినేటర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# రక్షణ సేన గట్టెక్కేనా?!

**మొదటిపేజీ తరువాయి**
చరిష్మా అంత తేలిగ్గా చెరిగిపోయేది కాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తండ్రి నిర్మించిన 'భారత్ రాష్ట్ర సమితి' క్షేత్రస్థాయిలో బలంగానే ఉంది. మరి అటువంటప్పుడు, తండ్రి పార్టీని కాదని, బిడ్డ పెట్టిన కొత్త 'టీఆర్ఎస్' పార్టీకి తెలంగాణ జనాలు ఏ మేరకు మద్దతు ఇస్తారనేది పెద్ద ప్రశ్నార్థకం. కేసీఆర్ ఓటు బ్యాంకునే కవిత చీల్చబోతున్నారా.. లేక కొత్త క్యాడర్‌ను సృష్టించుకోగలరా అనేది కాలమే సమాధానం చెప్పాలి.


**అధికార కాంగ్రెస్ గ్రౌండ్ వర్క్ స్పీడ్**
మరోవైపు, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టింది. నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ, వచ్చే 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటి నుంచే పక్కా గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేస్తోంది. ఇంతటి పటిష్టమైన వ్యూహాలతో, అధికార బలంతో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీని ఢీకొట్టే స్థాయి, సంఖ్యా బలం కవితకు ఉందా అనే సందేహాలు రాజకీయ వర్గాల నుండి వ్యక్తమవుతున్నాయి.


**బీజేపీ ఢిల్లీ పెద్దల బెంగాల్ వ్యూహం!**
ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తెలంగాణ గడ్డపై ఎలాగైనా కాషాయ జెండా ఎగురవేయాలని గట్టి పట్టుదలతో ఉంది. గతంలో పశ్చిమ బెంగాల్ వంటి బలమైన ప్రాంతీయ కోటలను సైతం గట్టిగా ఢీకొట్టి, అక్కడ తన ఉనికిని చాటుకున్న బీజేపీ.. తెలంగాణలోనూ అదే తరహా వ్యూహాన్ని అమలు చేస్తోందని ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ పెద్దల అండదండలు, అపారమైన వనరులు, సోషల్ మీడియా నెట్‌వర్క్‌తో దూసుకుపోతున్న బీజేపీని ఎదుర్కోవడం సామాన్యమైన విషయం కాదు. ఇటువంటప్పుడు ఢిల్లీ బీజేపీ పెద్దల వ్యూహాలను, కమలనాథుల దూకుడును తట్టుకునే సత్తా కవిత నాయకత్వానికి ఉంటుందా అనేది విశ్లేషకుల అంచనా.

**ముక్కోణపు పోటీలో కవిత దారెటు?**
ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి మూడు బలమైన శక్తులు తెలంగాణ రాజకీయాలను శాసిస్తున్నాయి. ఈ మూడు పార్టీల మధ్య ఓట్లు, క్యాడర్ విడిపోయి ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా వచ్చిన కవిత 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ ఈ ముక్కోణపు పోటీని తట్టుకుని ఏ విధంగా నిలబడుతుందనేది మింగుడుపడని అంశం. పార్టీ ఆవిర్భావం రోజు ఉన్న జోష్, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయి పోరాటాల్లోనూ కనిపిస్తేనే కవిత పార్టీకి మనుగడ ఉంటుంది. లేదంటే మూడు దిగ్గజ పార్టీల నడుమ ఈ కొత్త పార్టీ కేవలం ఓట్లను చీల్చేందుకే పరిమితం అవుతుందనే వాదనలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఏదేమైనా కవిత రీ ఎంట్రీ తెలంగాణ రాజకీయాల్లో ఒక కొత్త రసవత్తర చర్చకు తెరలేపింది.

# ప్రధాని మోదీకి కవిత లేఖ

- **బండి సంజయ్‌ను బర్తరఫ్‌కు డిమాండ్**
- **నిష్పక్షపాత దర్యాప్తు కోసం పదవి నుంచి తప్పించాలని విజ్ఞప్తి**
- **హోంశాఖలో కొనసాగితే విచారణపై ప్రభావం ఉంటుందనే ఆరోపణ**
- **ప్రజా విశ్వాసం కాపాడేందుకు తక్షణ నిర్ణయం అవసరమని వ్యాఖ్య**
- **కుమారుడిపై పోక్సో కేసు నేపథ్యంలో లేఖ రాసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు**





**తెలంగాణ బ్యూరో :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో, దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగాలంటే ఆయన పదవిలో కొనసాగడం సరికాదని పేర్కొన్నారు.
కేంద్ర మంత్రివర్గ నైతిక బాధ్యతలు, ప్రజా విశ్వాసం, చట్టపరమైన పారదర్శకత దృష్ట్యా ఈ అంశంపై వెంటనే స్పందించాలని కవిత విజ్ఞప్తి చేశారు. చట్ట అమలు సంస్థలపై ప్రభావం చూపే హోంశాఖ వంటి కీలక విభాగంలో కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు స్వేచ్ఛ దెబ్బతినే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.
మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో విచారణ పూర్తిగా స్వతంత్రంగా, పారదర్శకంగా, రాజకీయ ప్రభావం లేకుండా జరగాలని కవిత స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టాలంటే ఈ కేసులో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.
విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తప్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మైనర్ల భద్రత, మహిళల రక్షణ, న్యాయ పరిరక్షణ అంశాల్లో కేంద్రం రాజీపడదన్న స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే ఇదే సరైన చర్య అవుతుందని పేర్కొన్నారు.
ఈ నెల 8న 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఎంఆర్ఎఫ్ కార్మిక పోరాట సమితి 11 వ వార్షికోత్సవం.



సదాశివపేట. మే 16. (సిరి న్యూస్)

వన దుర్గభవాని మాత దేవాలయం ఏడుపాయలు లో కెపిఎస్ అధ్యక్షులు కొత్త గొల్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్ కార్మిక మిత్రులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఈ సమావేశానికి సదాశివపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రస్తుత కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ రాజకీయ నాయకులు జిల్లా జేఏసీనాయకులు సత్తయ్య యాదవ్, యూనియన్ నాయకులు మల్లేశం, నారాయణ, విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణ, విఠల్, శ్రీనివాస్, రాజ్ కిరణ్, వెంకట్రావు, వీరన్న, సత్యనారాయణ రెడ్డి, జైపాల్, నాగారం నర్సింలు, రాచయ్యా స్వామి, నజీర్ పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో కెపిఎస్ యూనియన్ అధ్యక్షులు కొత్త గొల్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ 11వ వార్షికోత్సానికి వచ్చిన కార్మికులకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది. మీ అందరి సహకారంతో ఈ 11 సంవత్సరాల లో రెండుసార్లు యూనియన్ను గెలిపించడం జరిగింది.ఇకముందు కూడా యూనియన్ను ప్రోత్సహించాలని మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, కార్మికుని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

**'టామ్‌కామ్' ద్వారా దరఖాస్తుల ఆహ్వానం**
**ప్రారంభ వేతనం నెలకు రూ. 2.2 లక్షలు**
**మొత్తం 90 ఖాళీల భర్తీ.. ఈ నెల 18 ఆఖరు తేదీ.**
**జిల్లా ఉపాధి అధికారి రవికిరణ్ రెడ్డి.**

సంగారెడ్డి, మే 16 (సిరి న్యూస్):

తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీకి చెందిన బిల్డర్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ, జర్మన్ అంతర్జాతీయ సహకార సంస్థల సమన్వయంతో మొత్తం 90 పోస్టుల భర్తీకి ఈ ప్రత్యేక నియామక కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ నివాసితులై ఉండి, గుర్తింపు పొందిన కాలేజీల నుండి జీఎన్ఎం (కనీసం 3 ఏళ్ల అనుభవం) లేదా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, ఇండియన్ నర్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉన్న 22 నుండి 38 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు దీనికి అర్హులని వివరించారు. కార్డియాలజీ, జనరల్ సర్జికల్, ఇంటెన్సివ్ కేర్ వంటి విభాగాల్లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, ప్రాథమిక ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఉచితంగా జర్మన్ భాషా శిక్షణ (B1, B2 స్థాయిలు) అందిస్తామని తెలిపారు. జర్మనీలో ప్రారంభ వేతనం నెలకు సుమారు 2300 యూరోలు (భారత కరెన్సీలో రూ. 2.2 లక్షలు) ఉంటుందని, అనుభవం వచ్చాక అది రూ. 3 లక్షల వరకు పెరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18 లోగా తమ రెజ్యూమ్‌ను germanytriplewin2025@gmail.com కు ఈమెయిల్ చేయాలని, ఇంటర్వ్యూలు జూలై 8 నుండి 17 వరకు జరుగుతాయని పేర్కొంటూ, మరిన్ని వివరాలకు 9440049645, 9440052081, 9440051581 నంబర్లలో లేదా వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

## ఇకనుండి మండలంలో నిరంతరం వి ఎన్ హెచ్ ట్రస్ట్ సేవలు

**డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్**




వెల్దుర్తి,మే 16, (సిరి న్యూస్):

వెల్దుర్తి మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం ఈ మధ్యకాలంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభం రోజు ఇచ్చిన మాట ప్రకారం వెల్దుర్తి మండలం లో శనివారం రోజున వీఎన్‌ఎచ్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ , తన తండ్రి జ్ఞాపకార్థం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇకనుండి ప్రతి శనివారం వెల్దుర్తి మండల కేంద్రంలో సంతను దృష్టి పెట్టుకొని తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తానని అంతేకాకుండా రానున్న రోజులలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం కూడా అందిస్తానని అన్నారు. అంతేకాకుండా వెల్దుర్తి మండల ప్రజల కోరిక మేరకు త్వరలోనే వైద్య సేవలు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదర్శ్ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ నాయకుడు చందు, ప్రభాకర్ తదితరులు

# అసంపూర్తి గ్రామపంచాయతీ భవనం

- నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి
- జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన రామ్‌రెడ్డిబాయి సర్పంచ్ సామల మహిపాల్‌రెడ్డి



గుమ్మడిదల ఏప్రిల్ 16 (సిరి న్యూస్):

గుమ్మడిదల మండల పరిధిలోని రామ్‌రెడ్డిబాయి గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం పనులు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోవడంతో గ్రామ పరిపాలన తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రామ్‌రెడ్డిబాయి గ్రామ సర్పంచ్ సామల మహిపాల్‌రెడ్డి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించిన మంత్రి స్పందించి సంబంధిత నిధుల ద్వారా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ అందజేసినట్లు చెప్పారు. మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆ లేఖను సంగారెడ్డి జిల్లా డిఆర్‌ఓకు అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలకు అందించాల్సిన సేవలు సక్రమంగా నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. గ్రామ ప్రజలు వివిధ ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, పన్నుల చెల్లింపులు తదితర పనుల కోసం కార్యాలయానికి వచ్చినప్పుడు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో అధికారుల సమావేశాలు, గ్రామాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల నిర్వహణ కూడా కష్టసాధ్యంగా మారిందన్నారు. గ్రామ అభివృద్ధి దృష్ట్యా ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలంటే గ్రామపంచాయతీ భవనం పూర్తి కావడం ఎంతో అవసరమని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వెంటనే నిధులు విడుదల చేయాలని సర్పంచ్ సామల మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణా గౌడ్, హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తీగల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా ఎదగాలి

- నిరుద్యోగులకు ఉపాధి కల్పించి ఆదర్శంగా నిలవాలి.
- హోటల్ టీ 4 యును ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడిరాజు.



సదాశివపేట. మే 16. (సిరి న్యూస్)

సదాశివపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీ 4 యు హోటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.పట్టణంలోని కొత్త రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట, జాతీయ రహదారి ఎన్ హెచ్-65 పక్కన హోటల్‌ను ఏర్పాటు చేశారు.అబ్దుల్ రజాక్ కుటుంబ సభ్యులు ఆధునిక సౌకర్యాలతో హోటల్‌ను ప్రారంభించారు.రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.పులిమామిడి రాజు రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను అధికారికంగా ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.స్థానిక ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆయన ఆకాంక్షించారు.యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడంఅభినందనీయమని పులిమామిడి రాజు పేర్కొన్నారు.వ్యాపార రంగంలో యువకులు ముందుకు రావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.టీ 4 యు హోటల్ ప్రారంభోత్సవం సదాశివపేటలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎండి ఫయాజ్, ఎండి నిసార్, అబ్దుల్ రజాక్, ఎండి అబ్దుల్, మోయిన్, ఎండి.ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కన్నపేటలో కలెక్టర్ పర్యటన..





- భద్రకాళీ రైస్ మిల్లు ఆకస్మిక తనిఖీ...

రామాయంపేట, మే 16 (సిరి న్యూస్)

రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని ఐకెపి (ఇందిరా క్రాంతి పథం)ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిఎం మార్కెటింగ్ అధికారి ,ఆర్డీవో, డి ఎం సి ఎస్, డీఎస్ఓ తాసిల్దార్ ఎంపీడీవో కలిసి కలెక్టర్ పరిశీలించారు.టోకెన్ విధానం అమలులో ఉందా? అనే అంశాన్ని పర్యవేక్షిస్తూ, నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. కేంద్రాల్లో , గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా?అని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఇప్పటి వరకు 1,32,992 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 533 కేంద్రాల్లో, 519 కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కోసం పనిచేస్తున్నాయన్నారు.టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ధాన్యం తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని సూచించారు.అలాగే రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులను ఎక్కువ సేపు వేచి ఉండే పరిస్థితులు రాకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అక్కడ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను, రవాణా వివరాలను పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా కొనుగోళ్లు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, తాసిల్దార్ రజని, ఎంపీడీవో, సంబంధిత కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.శనివారం సాయంత్రం రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని భద్రకాళి రైస్ మిల్లును జిఎం మార్కెటింగ్ అధికారి అభిషేక్ ,ఆర్డీవో రమాదేవి, డి ఎం సి ఎస్ జగదీష్, డీఎస్ఓ నిత్యానంద్ పాల్గొన్నారు

## బీసీ స్టడీ సర్కిల్‌లో 'ఏఐ అండ్ లైఫ్ స్కిల్స్' ఉచిత శిక్షణ

- 21 నుండి 4 రోజుల పాటు వర్క్‌షాప్
- మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో కార్యక్రమం
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల అభ్యర్థులు అర్హులు
- జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్.

సంగారెడ్డి, మే 16 (సిరి న్యూస్):

సంగారెడ్డి జిల్లా బి.సి. స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో నిరుద్యోగ యువతకు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు జీవన నైపుణ్యాలు'పై 4 రోజుల పాటు ఉచిత వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. జగదీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుండి 26 వరకు జరిగే ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థులకు లైఫ్ స్కిల్స్ తో పాటు ఏఐ యొక్క ప్రాథమిక అంశాలు, వివిధ అప్లికేషన్లపై అవగాహన కల్పించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేలా తీర్చిదిద్దడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు సంగారెడ్డి మరియు మెదక్ జిల్లాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20వ తేదీ సాయంత్రం లోపు బైపాస్ రోడ్డులోని వెలుగు ఆఫీస్ క్యాంపస్‌లో ఉన్న బి.సి. స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు కార్యాలయ వేళల్లో వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 08455-277015 లేదా 9494390803 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన వెల్లడించారు.

## వరిగుంతంలో గ్రామసభ

కొల్చారం మే 16 (సిరి న్యూస్)

కొల్చారం మండల పరిధిలోని వరిగుంతం గ్రామంలో గ్రామ సర్పంచ్ యోహన్ ఉప సర్పంచ్ వీరేశం గ్రామ కార్యదర్శి వార్డు మెంబర్ల సమీక్ష సమావేశం శనివారం నాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు గ్రామ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని తీర్మానం చేశారు ఇటీవల జరిగిన కొన్ని సమావేశాల్లో లేనిపోని సత్యదూరం వార్తలు రాయడం పట్ల విచారం వ్యక్తం చేశారు కొన్ని సమావేశాలు నిర్వహించేటప్పుడు సమస్య త్వరగా పరిష్కారం అయ్యేందుకు అయ్యేందుకు డోర్స్ క్లోజ్ చేసుకుని చేయాల్సిన అవసరం ఉంటుంది దీనిని తప్పుగా భావించిన కొందరు గ్రామస్తులు పత్రికా ఎలక్ట్రాన్ మీడియా వారికి తప్పుడు సమాచారం ఇస్తున్నారు దయచేసి వాస్తవాలు రాయండి మా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి మీ వంతు సహకారం అందించండి పత్రిక రంగానికి మేము ఎప్పుడు రుణపడి ఉంటాం ఇటీవల పదో వార్డు సభ్యురాలు రేణుక రవి టిఆర్ఎస్ పార్టీలో చేరడం పట్ల మెజార్టీ వార్డు సభ్యులు కలిగి ఉన్నారు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు శయ శక్తుల కృషి చేస్తాం



# అందరివాడు ఆవుల రాజి రెడ్డి

- నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణ
- వెల్దుర్తి మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభించిన ఉచిత మెగా కంటి పరీక్ష



వెల్దుర్తి,మే 16,(సిరి న్యూస్ )

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో శనివారం బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ను రాజన్న ఫౌండేషన్ అధినేత ఆవుల రాజిరెడ్డి తన సొంత నిధులతో ఘనంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో హైదరాబాదుకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణుల బృందంతో ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు.ఆధునిక పరికరాల సహాయంతో కంటి శుక్లం, గ్లాకోమా,రెటీనా సమస్యలు దూరదృష్టి సమస్య ను గుర్తిస్తున్నారు. గుర్తించిన రోగులకు అవసరాన్ని బట్టి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నారు. శస్త్ర చికిత్సలను కార్పొరేట్ ఆస్పత్రిలలో నిర్వహించి రవాణా వసతి సౌకర్యాలు కూడా రాజన్న ఫౌండేషన్ ఉచితంగా కల్పించనుంది. ఆపరేషన్ అనంతరం అవసరమైన నాణ్యమైన మందులు, కళ్ళ అద్దాలను కూడా ఉచితంగా అందజేయనున్నారు. ఉదయం 9 గంటల నుండి ప్రారంభమైన ఈ శిబిరానికి వెల్దుర్తి మండలం లో నుంచి సుమారు వెయ్యి మంది ప్రజలు తరలివచ్చారు. వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ కళ్ళను పరీక్షించుకుంటున్నారు. అనంతరం ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులో తేవడమే రాజన్న ఫౌండేషన్ లక్ష్యమన్నారు. వెల్దుర్తి లోని అన్ని గ్రామాలకు సంబంధించి మండలంలోని ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. శిబిరం సజావుగా సాగేందుకు ఆసుపత్రి వాలంటీర్లు స్థానిక నాయకులు విస్తృత ఏర్పాటు చేశారు . రోగులకు మంచినీరు, భోజనం కూడా అందజేశారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడు మన ఆవుల రాజిరెడ్డి అని సంవత్సర కాలం నుండి ఇప్పటికీ తన సొంత నిధులతో రాజన్న పౌండేషన్ ద్వారా పార్టీలకు అతీతంగా నిరుపేదలకు సహాయం చేయడమే తన ఉద్దేశంగా పెట్టుకొని అటు యువత ఇటు గర్భిణీ స్త్రీలు అలాగే ఈరోజు అన్ని వర్గాలకు ఇటు మహిళలు అటు యువత ఇటు వృద్ధులకు ఉచిత మెగా కంటి వైద్యం అందించడం అనేది చాలా మంచి కార్యక్రమం అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి, వెల్దుర్తి మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, రాష్ట్ర ఫిషర్ మ్యాన్ కార్యదర్శి మల్లేష్, మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమన్న గారి నరేందర్ రెడ్డి, మల్లేశం చారి, కొత్త ముక్తా బాయ్, ఇతర గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





# టోల్ రుసుము చెల్లిస్తున్నా... సేఫ్టీలో సున్నా!

మునిపల్లి, మే 16 (సిరి న్యూస్)




మునిపల్లి మండలంలోని లింగంపల్లి శివారులో జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే జాతీయ రహదారిపై భద్రతా లోపాలు వాహన దారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన క్రాష్ బ్యారియర్ ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోక పోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మలుపు ప్రాంతం కావడంతో ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దెబ్బతిన్న క్రాష్ బ్యారియర్‌ను నెల రోజులుగా పునరుద్ధరించకపోవడంతో భారీ వాహనాలు, ఇతర వాహనాలు అదుపు తప్పితే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదే ప్రాంతంలో రహదారి అంచు సూచించే వైట్ ఎడ్జ్ లైన్ కూడా లేకపోవడంతో ప్రమాద ముప్పు మరింత పెరిగిందని వాహనదారులు చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కోతుల దాడిలో భవనం పై నుండి కిందపడిన యువకుడికి



నర్సాపూర్ మే 16, (సిరి న్యూస్):

కోతుల దాడిలో తప్పించుకునే క్రమంలో యువకుడు భవనంపై నుండి కిందపడి గాయపడ్డాడు ఈ సంఘటన శనివారం నర్సాపూర్ పట్టణంలో జరిగింది కుటుంబ సభ్యుల వివరణ ప్రకారం గణేష్ (24) అనే యువకుడు బిల్లింగ్ పై ఉండగా కోతుల గుంపు ఒక్కసారిగా అతనిపై దాడి చేయడంతో వాటి నుండి తప్పించుకునే క్రమంలో భవనం పై నుండి కింద పడి స్వల్ప గాయాలతో బయటపడ్డారు స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు చికిత్స అందించి అనంతరం వారి సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామని తెలిపారు నర్సాపూర్ మున్సిపాలిటీలో కోతుల బెడదతో జనాలు ఇబ్బందులు పడుతున్నారని తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అధికారులు స్పందించి కోతుల బెడద నుండి పట్టణ ప్రజలను కాపాడాలని కోరుచున్నారు.

# బీజేపీ ఒబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గంలో మెదక్ నేతకు చోటు

- రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా గడ్డం కాశీనాథ్ నియామకం

మెదక్ ప్రతినిధి,మే16(సిరి న్యూస్)



భారతీయ జనతా పార్టీ ఒబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గంలో మెదక్ జిల్లాకు ప్రాధాన్యం లభించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు సూచనల మేరకు, బీజేపీ ఒబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్ రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గ సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో మెదక్ జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గడ్డం కాశీనాథ్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించడం జిల్లాలో చర్చనీయాంశమైంది.1974 నవంబర్ 10న జన్మించిన గడ్డం కాశీనాథ్ బాల్యంనుంచే స్వయంసేవకుడిగా సామాజిక సేవలో అడుగుపెట్టారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో పెరిగిన ఆయన విద్యార్థి దశలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ వాహిని వంటి సంస్థల్లో కీలక పాత్రలు పోషించారు. బీజేపీ లో చేరిన అనంతరం బీజేపీ సీనియర్ నాయకుడు టైగర్ నరేంద్ర రాజకీయ ప్రస్థానంలో కీలకంగా పనిచేశారు. పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కష్టపడి పనిచేసిన నేతగా గుర్తింపు పొందారు.పోలీసుల అక్రమ కేసులు, ప్రజలపై వేధింపుల అంశాలపై గడ్డం కాశీనాథ్ అనేకసార్లు నిరసనలు చేపట్టారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ఉద్యమ రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.గడ్డం కాశీనాథ్ రాజకీయ జీవితంలో అనేక కీలక పదవులు నిర్వహించారు. మెదక్ పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులు గా,బీజేపీ జిల్లా కార్యదర్శి గా,జిల్లా కార్యవర్గ సభ్యులు గా ఉమ్మడి మెదక్ జిల్లా వాణిజ్య వ్యాపార విభాగ కన్వీనర్ గా 2017లో మెదక్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు 2018లో ఒబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గా 2020లో జిల్లా సహ కోశాధికారి గా 2023 నుంచి ఒబీసీ మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులుగా ఇలా పలు బాధ్యతలను నిర్వర్తిస్తూ పార్టీకి సేవలందించారు.మెదక్ జిల్లా కేంద్రం సాధన కోసం జరిగిన రిలే నిరాహార దీక్షల్లో ఆయన పాల్గొన్నారు. అలాగే రైల్వే ఉద్యమాల్లోనూ చురుకైన పాత్ర పోషించారు.మెదక్ పట్టణంలో వినాయక నిమజ్జన సమయంలో జరిగిన వివాదాస్పద ఘటనలపై నిరసన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. నర్సాపూర్‌లో విద్యార్థినులు పూస్తే మెట్టెలు తీసి పరీక్షలకు హాజరుకావాలన్న ఘటనపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టి వార్తల్లో నిలిచారు.బండి సంజయ్ కుమార్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో మెదక్, కామారెడ్డి జిల్లాల రూట్ మ్యాప్ ఇన్‌చార్జిగా గడ్డం కాశీనాథ్ పనిచేశారు. యాత్ర విజయవంతానికి సమన్వయం చేస్తూ పార్టీ శ్రేణుల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు.స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, బీసీ హక్కుల కోసం పోరాటాలు, పలు సేవా కార్యక్రమాల్లో గడ్డం కాశీనాథ్ ముందుండి పనిచేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ తరఫున నిరంతరం గళమెత్తుతూ ప్రజా సమస్యలపై స్పందిస్తూ వస్తున్నారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించడంపై గడ్డం కాశీనాథ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు, ఒబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్, మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గడ్డం కాశీనాథ్‌కు రాష్ట్ర స్థాయి బాధ్యతలు రావడంతో మెదక్ జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం సముచిత గౌరవం ఇచ్చిందని పేర్కొంటున్నారు.

# అచ్చంపేటలో ఉచిత వైద్య శిబిరం




నర్సాపూర్ మే 16, (సిరి న్యూస్):

మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం అచ్చంపేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో సుమారు 150 మంది గ్రామస్తులకు వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు స్కానింగ్ ఇతర పరీక్షలకు మల్లారెడ్డి ఆసుపత్రికి రావాలని డాక్టర్లు సూచన చేశారు గ్రామ సర్పంచ్ తుల్చమ్మ బిక్షపతి మాట్లాడుతూ మారుమూల గ్రామమైన అచ్చంపేట ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషమని గ్రామంలో వృద్ధులకు వికలాంగులకు ఆసుపత్రులకు వెళ్లాలంటే ఇబ్బందులు ఉంటాయని ప్రయాణ ఖర్చులు భరించలేని వారికి ఈ శిబిరంతో ఎంతో ఉపయోగం కనుక గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఇలాంటి వైద్య శిబిరాలు మరెన్నో నిర్వహించాలని మల్లారెడ్డి ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవీన్ వార్డు సభ్యులు వరమ్మ. డాక్టర్ నిఖిల్, మహమూద్ నాగప్ప , ఆసుపత్రి సిబ్బంది సోనీ, నిహారిక, వై సోని గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాలిక కిడ్నాప్‌కు విఫల యత్నం

- బైకుపై బలవంతంగా ఎతుకెళ్లేందుకు ప్రయత్నం
- బాలిక బైకు దూకేయడంతో తీవ్ర గాయాలు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జోగిపేట, మే 16, (సిరి న్యూస్):



అందోలు మండలం అల్మాయిపేట గ్రామ బస్టేజి వద్ద ఒంటరిగా నిలబడి ఉన్న మైనర్ బాలికను బలవంతంగా బైకుపై ఎక్కించుకొని నిర్మానుశ్య ప్రదేశానికి తీసుకువెళుతుండగా ఆ అమ్మాయి భయపడి దూకేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన అందోలు మండలం మాసానిపల్లి గ్రామ శివారులో శనివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి భాదితురాలి తల్లి సమంత తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హత్నూర మండలం బడంపేట గ్రామానికి చెందిన మైనర్ బాలిక అల్మాయిపేట గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు స్థానిక బస్టాప్ వద్ద మేనమామ దింపేసి వెళ్లాడు. అదే సమయంలో చౌటకూర్ గ్రామానికి చెందిన మొగులయ్య బైకుపై జోగిపేట వైపు వెళుతుండగా అమ్మాయి ఒంటరిగా కనిపించడంతో ఆమె వద్దకు వచ్చి బలవంతంగా ఆ బాలికను తన బైక్‌పై కూర్చొబెట్టుకొని మాసానిపల్లి వైపు స్పీడ్‌గా వెళుతూ నాతో పండుకోవాలని, రూ.5వేలు ఇస్తానని చెప్పగా, నా చుట్టాలు పోలీస్ కానిస్టేబుల్ ఉన్నాడు చెబుతాను అని బాలిక చెప్పినా భయపడకుండా మరింత స్పీడ్ పెంచడంతో అమ్మాయి బైకు పై నుంచి కిందకు దూకేసింది. దీంతో ఆమె కాళ్లకు, మొఖానికి తీవ్ర గాయాలయ్యాయి. కింద పడ్డాక కూడా తనకు ముద్దు పెట్టాలని బలవంత పెట్టాడని పేర్కొంది. అటువైపుగా వచ్చిన వారు విషయం తెలుసుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పాండు పోలీస్‌సిబ్బందితో వెళ్లి ఆ బాలికను జోగిపేట ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. మొగులయ్యపై స్థానికులు దాడి చేయడంతో ఒక పళ్లు ఊడిపోయింది. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు సమాచారం ఇవ్వడంతో తాము ఆసుపత్రికి వచ్చినట్లు తల్లి సమంత, తండ్రి లింగమయ్యలు తెలిపారు. కూతురుకు పరీక్ష ఉందని చెప్పడంతో ఇంటికి వస్తుండగా ఈ ఘటన జరిగిందని తల్లి తెలిపారు. నా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు జరుపుతున్నారు.

# ఖరీఫ్‌లో సన్న వరి సాగుకు రైతులు ముందుకు రావాలి

**కలెక్టర్ కట్టా హైమావతి**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మే 16,**
వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సన్న వరి ధాన్యం సాగు చేసేందుకు ప్రతి రైతు ముందుకు రావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి పిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో జరుగుతున్న వరి ధాన్యం దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలోని 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోదాముల్లో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన రైతుల ధాన్యాన్ని దిగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఒక గోదాం దాదాపు పూర్తిగా నిండిపోయిందని, మరొక గోదాంలో ఉన్న గన్ని బ్యాగులను ఇతర గోదాములకు తరలించి అక్కడ కూడా ధాన్యం నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రస్తుతం మార్కెట్ కమిటీ గోదాముల్లో ధాన్యం దిగుమతి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఏఎంసీలలో పనిచేస్తున్న హమాలీలు బయటకు వెళ్లకుండా, పూర్తిగా ఇక్కడే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా ఏఎంసీలో రైతులతో మాట్లాడిన కలెక్టర్, వచ్చే ఖరీఫ్‌లో సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు. సన్న



వడ్లకు ప్రభుత్వం బోనస్ అందిస్తోందని, మన జిల్లాలో పండే సన్న బియ్యం జిల్లా ప్రజల అవసరాలకు సరిపోతుందని తెలిపారు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం సరిపోక ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, అందువల్ల రైతులు సన్న వరి సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సదానందం, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి అన్ని శాఖల సమన్వయంతో బడిబాట విజయవంతం చేయాలి




**సంగారెడ్డి ప్రతినిధి, మే 16, :**
ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట జయప్రదం చేయాలని ప్రభుత్వ ప్రణాళికలో నమోదును పెంచాలి జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు. జిల్లాలో ప్రస్తుతం ఐదు నుండి 14 సంవత్సరాల మధ్య వయసున్న గల సుమారు 59 07 మంది పిల్లలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు గత విద్యా సంవత్సరంలో మొదటి తరగతిలో సుమారు పదివేల 500 మంది విద్యార్థులను ప్రవేశం పొందగా ఈ సంవత్సరం అన్ని తరగతులు కలిపి 12040 నిర్దేశించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న బడిబాట అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని అదనం కలెక్టర్ పాండు ఆదేశించారు శనివారం కలెక్టర్ కార్యాలయంలో బడిబాట ఏర్పాట్లపై నిర్మాణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 19వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మిల్లులు లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం దిగుమతి చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మే 16, :**
జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, మిల్లులకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం దిగుమతి తప్పనిసరిగా చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ మండలంలోని పందిళ్ల గ్రామంలో ఉన్న షణ్ముఖ ఇండస్ట్రీస్, గౌరీ శంకర్ ఆగ్రో ఇండస్ట్రీస్, పవనసుత ఇండస్ట్రీస్ మిల్లులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ధాన్యం దిగుమతి ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా వేగంగా మిల్లులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో మిల్లర్ యజమానులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. దిగుమతిలో ఎలాంటి జాప్యం లేకుండా ఎక్కువ సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచి షిఫ్ట్‌ల వారీగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో పనిచేసే స్థానిక హమాలీలను కొనుగోలు కేంద్రాల వద్ద వినియోగిస్తే మిల్లుల్లో దిగుమతి ప్రక్రియ వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ బాధ్యతను స్థానిక తహసీల్దార్ పర్యవేక్షించాలని సూచించారు. ధాన్యం దిగుమతి పూర్తైన వెంటనే మిల్లర్ అక్‌నాలెడ్జ్‌మెంట్, ట్రక్ షీట్ జనరేషన్, ఓపీఎంఎస్ అప్లోడ్ వంటి ప్రక్రియలను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దిగుమతిలో ఆలస్యం కాకుండా రెవెన్యూ అధికారులను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, తహసీల్దార్ లక్ష్మారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సంఘీభావం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 16,**
కాప్ర జోన్‌లో పద్మశాలి టౌన్ షిప్ లో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం అమావాస్య నుండి చేపట్టిన సమ్మెలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంట్రింగ్ వర్కర్లకు అనేక సమస్యలు ఉన్నాయని, వారికి రావాల్సిన న్యాయబద్ధ మైన హక్కులు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, అలాగే 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి కార్మికుడికి పెన్షన్ ప్రకటించాలని ప్రభుత్వానికి తన వంతుగా నివేదిక సమర్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్ గౌడ్, సెంట్రింగ్ నాయకులు కనకరాజ్ గౌడ్, మంచాల మల్లేష్, బాల్దె శ్రీశైలం, కుందనపల్లి మల్లేష్, కళ్లెం రాము నర్సింహారెడ్డి, నర్సింగరావు జహంగీర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి పొన్నం ప్రభాకర్ తో కరీంనగర్ నియోజకవర్గం పార్లమెంటు సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, మే 16,**



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశంలో పాల్గొన్నారు. శనివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మరియు సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నియమితులైన కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు మరియు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో నియోజకవర్గ పరిధిలోని కోఆర్డినేటర్లు, కార్యకర్తలు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ శ్రీశైలం గౌడ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులపై ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, కోఆర్డినేటర్లతో వివరాలు తెలుసుకుని పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రియాశీలకంగా పనిచేయాలని తెలియజేశారు. బూత్ లెవల్ ఏజెంట్ ప్రక్రియను వేగవంతం చేసి జాబితాను తొందరగా పీసీసీకి అందజేయాలని నాయకులను కోరారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజ్, ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నిర్వహించిన జూమ్ కాల్ కాన్ఫరెన్స్‌లో నాయకులు పాల్గొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన శ్రీశైలం గౌడను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, కోఆర్డినేటర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్చార్యులు ఒడిదల ప్రణవ్, కేకే మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు అంజన్ కుమార్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు బొమ్మ శ్రీరామ్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, సౌజన్య గౌడ్, దూడెం వెంకటరమణ, ఫక్రుద్దీన్, రాజ్ దేఖపాటి, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో బి పాజిటివ్ రక్తం అందజేత

- **ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ,మే 16,**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో సామల సుష్మ కు బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సింగరాయ పల్లి గ్రామానికి చెందిన అధికం నిఖిల్ గౌడ్ సకాలంలో రక్తాన్ని అందజేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ వేసవి కాలం కావడం వలన రక్తనిధి కేంద్రాలలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యువత రక్తదానానికి ముందుకు రావాలని, రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రక్తదాతల తోనే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. రక్తదాత నిఖిల్ గౌడ్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్ అధ్యక్షుడు జమీల్ హైమద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్,ఉపాధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్,పర్ష వెంకటరమణ, సలహాదారులు జలిగామ శ్రీకాంత్, అంకం బాలకిషన్ లు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 16,**

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని ఆరుగురికి రూ.2,14,500 ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి షబ్బీర్ అలీ సహకారంతో మంజూరు కాగా లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్థానిక మండల నాయకులు శనివారం చెక్కుల పంపిణీ చేశారు.ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మొత్తం ఆరుగురు లబ్ధిదారులకు రూ.2,14,500 విలువైన చెక్కులను స్థానిక ప్రజా ప్రతినిధులు అందజేశారు. దోమకొండ గ్రామానికి చెందిన ఐదుగురికి, గొట్టుముక్కుల గ్రామానికి చెందిన ఒకరికి చెక్కులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్ తెలిపారు.లబ్ధిదారులలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నల్లపు రమేష్‌కు రూ.60,000, లింగ సక్కుబాయికి రూ.60,000, దూకుడు బాలరాజుకు రూ.32,000, నాగయ్యకు రూ.19,000, శ్రీధర్ బండారికి రూ.23,500, మల్లారెడ్డికి రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని పేర్కొన్నారు. షబ్బీర్ అలీ సహకారంతో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులు అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐరనీ నరసయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆశబోయిన



శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, శంకర్ రెడ్డి, అబ్రబోయిన రాజు, నయీమ్, నేతల మల్లేశం, పెద్దిరెడ్డి సిద్దారెడ్డి, షమ్మీ, మరి శేఖర్, నర్సింలు,రవి, మహమ్మద్, నిమ్మ బాలరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి నివారణలో భాగస్వాములు కావాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి,మే 16,**
హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వై ఆర్ జి కేర్ లింకు వర్కర్ స్కీమ్ జిల్లా రిసోర్స్ పర్సన్ గర్దాస్ సుధాకర్ కోరారు. శనివారం కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలో ఆయన గ్రామ సర్పంచి ఏదుల్ల సాధ్వికతో పాటు గ్రామ పెద్దలు యువకులతో కలిశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన లింకు వర్కర్ స్కీం ద్వారా గ్రామంలో అందిస్తున్న సేవలను గురించి వివరించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కోసం గ్రామంలోని ప్రధాన కూడళ్లలో గోడ రాతలు రాయించాలని సర్పంచిని కోరారు. హెచ్ఐవి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొ న్నారు. తమ సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవల విజయవంతనికి అందరూ భాగస్వా ములు కావాలని పేర్కొన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై సమాచారం కోసం 1097 టోల్ ఫ్రీ నెంబర్ కి డయల్ చేయాలని కోరారు. కార్యక్ర మంలో గ్రామ కార్యదర్శి రమేష్, ఉప సర్పంచ్ ప్రశాంతు, లింకు వర్కర్ బాల్ కిషన్, మాజీ ఉప సర్పంచ్ సాయినాథ్, నాయకులు తేలు సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.



# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- **రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్**



**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, మే 16,**
కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కొత్త పాత తేడా లేకుండా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన గెల్లు చంద్రశేఖర్ ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకోని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మండలంలో పార్టీ బలోపేతానికి పనిచేయాలని మంత్రి సూచించారు. గతంలో పనిచేసిన నాయకులతో పాటు కార్యకర్తలను విస్మరించకుండా పార్టీ నియమాలను లోబడి పనిచేస్తు వచ్చే ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చాలని మంత్రి సూచించారు.



# సకినాల పండగ సంక్రాంతి

తెలంగాణలో సంక్రాంతి అనగానే సకినాల పండగ అనడం అందరికీ తెలిసిందే. ఈ వారంలో సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటి వాకిట్లో కంచుడు పెట్టి సకినాలు చేయాల్సిందే. సకినాలు అందరికీ చేయడం రాదు. ముఖ్యంగా దీనికి బియ్యాన్ని నానబెట్టి దాన్ని గిర్నిలో పట్టించి ఆ తర్వాత సకినాలు పోస్తారు. ఇదే కాకుండా గారెలు, మురుకులు, వివిధ రకాల పిండి వంటలు చేసుకోని.. కోడి కూర వండుకుని తినడం స్పెషల్.
అయితే కొందరు బియ్యప్పిండితో మురుకులు చేసుకోవాలనుకుంటారు. కరకరలాడుతూ ఎంతో టేస్టీగా ఉండే వీటిని పిల్లల నుంచి పెద్దల వరకు చాలా ఇష్టంగా తింటారు. కానీ, చాలా మందికి అవి అంత పర్ఫెక్ట్‌గా కుదరవు. అలాంటి వారు ఈ సంక్రాంతికి ఇలా ట్రై చేయండి. కరకరలాడుతూ టేస్టీగా, క్రిస్పీగా వస్తాయి! మరి, అందుకు కావాల్సిన పదార్థాలు తయారీ తెలుసుకుందాం ఇందుకోసం ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అందులో నీళ్లు పోసి నాలుగైదు గంటల పాటు నానబెట్టుకోవాలి.
ఆ తర్వాత నీళ్లు వడకట్టి ఒక శుభ్రమైన క్లాత్ మీద పలుచగా పరచి కనీసం 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. నీరంతా పోయి కాస్త తడిగా ఉన్నప్పుడు గిర్నీకి తీసుకెళ్లి పిండి పట్టించి తెచ్చుకోవాలి.
ఆ తర్వాత పట్టించుకున్న పిండిని ఒక వెడల్పాటి ప్లేట్(బేషన్)లో జల్లించుకొని పక్కనుంచాలి.
అనంతరం స్టౌపై చిన్న కడాయి పెట్టుకొని నువ్వులను వేసి దోరగా వేయించుకోవాలి. ఆపై వాటిని జల్లించుకున్న పిండిలో వేసుకోవాలి.
అలాగే వాము, తగినంత ఉప్పు వేసుకొని అన్నీ కలిసేలా ఒకసారి చక్కగా కలుపుకోవాలి. ఆ తర్వాత అందులో తగినన్ని వాటర్ యాడ్ చేసుకుంటూ మురుకుల పిండిలా తడిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఓ కాటన్ క్లాత్‌ను తడిపి పలుచగా పరచి కలిపి పెట్టుకున్న పిండిని కొంచెం కొంచెం చేత్తో తీసుకుని వేళ్లతో పొడువుగా తిప్పుతూ మూడు లేదా నాలుగు చుట్లుగా చుట్టాలి. ఆవిధంగా పిండి మొత్తాన్ని చేసుకోవాలి. తర్వాత వాటిని కాసేపు ఆరనివ్వాలి.
ఆలోపు స్టౌపై కడాయిలో నూనె పోసి వేడి చేసుకోవాలి. ఆయిల్ కాగిన తర్వాత సకినాలను వేసుకొని దోరగా కాలనిచ్చి తీసేయాలి.
చల్లారిన తర్వాత ఏదైనా డబ్బాలో వేసి స్టోర్ చేసుకుంటే చాలు. అంతే, ఎంతో టేస్టీగా ఉండే "తెలంగాణ స్పెషల్ సకినాలు రెడీ.
అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే పిండిని చేతిలోకి తీసుకుని వేళ్లతో సన్నని తాడుగా వలయాకారంగా చేయడానికి నైపుణ్యం ఉండాలి.
కాబట్టి, ఒకవేళ మీకు అలా చేయడం రాకపోతే జంతికల గొట్టంలో స్టార్ గుర్తు ఉన్న బిళ్లను వేసి లోపల కొద్దిగా ఆయిల్ రాసి పిండి ముద్దను ఉంచి సకినాల షేప్‌లో ఒత్తుకున్నా సరిపోతుంది.



# పిల్లలకు తప్పక నేర్పించాల్సిన విషయాలేంటో తెలుసా

ప్రతి చిన్నారికి కూడా తొలి గురువులు తల్లిదండ్రులే. వారిని చూసే పిల్లలు చాలా విషయాలు నేర్చుకుంటారు. తొలి పలుకుల దగ్గర నుంచి తొలి అడుగుల వరకు తల్లిదండ్రుల ద్వారా నేర్చుకుంటారు. ఇలాంటి సమయాల్లోన్నే తల్లిదండ్రులు కూడా చాలా జాగ్రత్త వహించాలి. ప్రతి విషయాన్ని పిల్లలకు చాలా జాగ్రత్తగా నేర్పించుకోవాలి. చిన్నప్పుడు తల్లిదండ్రి నేర్పించే ప్రతి విషయం కూడా వారి వ్యక్తిగత ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయి. పిల్లలు ఉన్నతంగా ఆలోచించాలి అంటే ఇవి వారికి ఉపయోగపడతాయి. పిల్లల అభివృద్ధిలో పేరింగ్ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. తల్లిదండ్రులు నేర్పించే అంశాలను బట్టే వారి నడవడిక ఉంటుంది. తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు మంచి రోల్ మోడల్‌గా ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటే పిల్లలను చూసే తల్లిదండ్రులు చాలా విషయాలను నేర్చుకుంటారు. వారు పైకి ఉన్నతంగా ఎదగాలి అంటే తప్పకుండా మీరు సరైన విలువలు నేర్పించాలి. భవిష్యత్తులో మంచి వ్యక్తులుగా ఎదగాలని పిల్లలకు నేర్పించాలి. గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత కథలను చిన్నప్పటి నుంచే వినిపించాలి. చిన్నారుల ముందు మంచిగా ప్రవర్తించాలి. తల్లిదండ్రులు తమ పిల్లల ముందు చేసే, చెప్పే లేదా ప్రవర్తించే వాటిని పిల్లలు మోడల్ చేస్తారు.
పిల్లలు పెద్దయ్యాక ఎలా ప్రవర్తిస్తారు. పిల్లలకు ప్రాథమిక జీవన నైపుణ్యాలను నేర్పడంలో తల్లులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నట్లే, బయట ప్రపంచంలో వారికి సహాయపడే పాఠాలను పిల్లలకు నేర్పించడంలో తండ్రి ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. తండ్రులు తమ పిల్లలకు కూడా కచ్చితంగా మంచి విషయాలను నేర్పించాలి.

**ఇతరులను గౌరవించండి**

తండ్రులు తమ పిల్లలకు నేర్పించవలసిన ముఖ్యమైన విషయాలలో ఒకటి ఇతరులను గౌరవించడం గురించి చెప్పాలి. తల్లిదండ్రులు ఇంట్లో ఒకరినొకరు గౌరవంగా చూసుకుంటే, పిల్లలు కూడా తమ చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరినీ గౌరవించడం ప్రారంభిస్తారు. వయస్సు లేదా ఇతర భేదాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించడం పిల్లలకు నేర్పించాలి.

**తప్పులను అంగీకరించడం**

తండ్రులు తమ పిల్లలకు తమ తప్పులను అంగీకరించమని ఎల్లప్పుడూ నేర్పించాలి. తండ్రి మొండిగా ఉండి తప్పులు ఒప్పుకోకుంటే పిల్లలకు కూడా ఇదే అలవాటు అవుతుంది. ఇంట్లో వాదనల సమయంలో కోపం చూపిస్తే పిల్లలు ఆ ప్రవర్తనను ఆదర్శంగా తీసుకుని, తమను తాము రక్షించుకునే అలవాటును పెంచుకుంటారు. పొరపాట్లను అంగీకరించడం వల్ల పిల్లలు జీవితంలో గొప్పవారు అవుతారని పిల్లలకు నేర్పించాలి.

**వైఫల్యానికి భయపడవద్దు**

వైఫల్యాన్ని తప్పుగా లేదా చెడుగా చూడకూడదని పిల్లలకు నేర్పించడం చాలా ముఖ్యం. అపజయం జీవితంలో ఒక భాగమని, అపజయమే విజయానికి మొదటి మెట్టు అని పిల్లలకు నేర్పించాలి. అపజయంలేని విజయం గర్వాన్ని ఇస్తుందని పిల్లలకు నేర్పించాలి.

**అనుభవాలు నేర్పే పాఠాల గురించి గొప్పగా చెప్పాలి.**

ఓడిపోవడం వల్ల నష్టమేమీ లేదని తండ్రులు తమ పిల్లలకు ఎప్పుడూ నేర్పించాలి. వారు తిరస్కరణను ఎదుర్కోవటానికి ఇష్టపడరు లేదా భయపడతారు. కష్టపడి, నిరంతర శ్రమతో విజయం సాధించవచ్చని పిల్లలకు కూడా నేర్పించాలి. ఓడిపోయినా, గెలిచినా గెలుపై వైపునకు సాగాలి అని పిల్లలకు పాఠాలు చెప్పాలి. అప్పుడే వారు బాగుపడతారు.



# ముఖంపై జిడ్డు పోవాలంటే ఇలా ట్రై చేయండి

**చలికాలంలో చాలా మందికి ముఖంపై జిడ్డు కనిపిస్తుంది. ముఖ్యంగా చలికాలంలో ఇంకాస్త ఎక్కువగా ఈ సమస్య వేధిస్తుంటుంది. ఇలాంటి వారు మాయిశ్చరైజర్ రాసుకోవాలన్నా ఇబ్బంది పడుతుంటారు. కానీ, కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే ఈ సమస్యకు పరిష్కారం చూపొచ్చు.**



**ఉప్పు:**
ఇందుకోసం స్ప్రే సీసాలో నీళ్లు తీసుకుని అందులో చెంచా ఉప్పు వేసి.. ముఖం మీద ఆ నీటిని తరచూ స్ప్రే చేసుకుంటూ తుడుచుకోవాలని చెబుతున్నారు. ఇలా చేస్తే జిడ్డు సమస్య క్రమంగా తగ్గుముఖం పడుతుందని వివరిస్తున్నారు. అయితే, కళ్లపై మాత్రం ఆ స్ప్రే పడకుండా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు.

**పసుపు:**
ఇందులో పుష్కలంగా ఉండే యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జిడ్డుదనాన్ని దూరం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రతిరోజూ రాత్రిపూట చెంచా పసుపులో కొన్ని పాలు పోసి మెత్తటి ముద్దలా చేసుకోని ముఖం, మెడకు రాసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా పెట్టుకుని పావుగంటయ్యాక కడిగేస్తే ముఖంపై పేరుకున్న జిడ్డు తొలగిపోతుందని వివరిస్తున్నారు.






**వంటసోడా:**
జిడ్డు సమస్యకు వంటసోడా కూడా బాగా ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. ఇందుకోసం చెంచా నిమ్మరసంలో అరచెంచా బేకింగ్ సోడా కలిపి మొటిమలు ఉన్న చోట పూతలా వేయాలని చెబుతున్నారు. ఆ తర్వాత తడి చేత్తో మర్దన చేసి ఆ పూతను తొలగిస్తే మృతకణాలు పోతాయని వివరిస్తున్నారు. ఇంకా మొటిమలు కూడా తగ్గుముఖం పట్టడమే కాకుండా.. అలాగే జిడ్డు సమస్య కూడా తగ్గుతుందని వెల్లడిస్తున్నారు.



# కాఫీ తాగుతున్నారా.. అయితే మీ ఆయుష్షుకు గుడ్ న్యూస్

రోజుకో కప్పు కాఫీ తాగే అలవాటు ఉందా.. తాజా అధ్యయనం ప్రకారం, రోజు కాఫీ తాగడం వల్ల ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉంది.
కాఫీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇటీవలి చేసిన ఓ అధ్యయనంలో ఎన్నో ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. కాఫీని ఎప్పుడు పడితే అప్పుడు తాగకూడు అని చెబుతున్నారు నిపుణులు. ఎప్పుడు తాగాలంటే.. యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం విషయాలు విస్తుగొలిపేలా ఉన్నాయి. ఉదయం కాఫీ తాగేవారికి గుండె జబ్బుతో మరణించే ప్రమాదం తక్కువగా ఉంటుంది. రోజంతా కాఫీ తాగే వారికి మరణ ప్రమాదం తక్కువగా ఉంటుంది. ఉదయం పూట కాఫీ తాగేవారిలో మరణాలు 16 శాతం తక్కువగానూ, గుండె జబ్బులతో మరణించే అవకాశం 31 శాతం తక్కువగానూ ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయని అమెరికాలోని తులాన్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు.
ఉదయం కాఫీ తాగితే, మధ్యాహ్నం తాగే వారి కంటే మరణాల రేటు తక్కువగా ఉంటుందని అధ్యయనం కనుగొంది. కాఫీని సరైన సమయంలో తాగటం గురించి ఆరోగ్య ప్రభావాలను వెల్లడించడం ఇదే మొదటి సారి అని తెలుస్తుంది. మా అధ్యయన ఫలితాలు మీరు ఎంత కాఫీ తాగుతున్నారో లేదా ఎంత మోతాదులో తాగుతున్నారో, ఎప్పుడు త్రాగుతున్నారో కూడా తెలుసుకుని పరిశోధన చేసినట్లు డాక్టర్ లుగుయ్ చెప్పారు. అధ్యయనంలో, పరిశోధకులు 1999 మరియు 2018 మధ్య సుమారు 40,725 మందిపై అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంలో పాల్గొనేవారు కనీసం ఒక రోజులో ఏ ఆహారం, పానీయాలు తీసుకున్నారనే దానితో పాటు వారు కాఫీ తాగారా, అలా అయితే ఎంత, ఎప్పుడు అనే దాని గురించి డేటాను సేకరించారు. దీంట్లో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఉదయం లేచిన తర్వాత కాఫీని తీసుకుంటే ఆరోగ్యానికి మంచింది. మధ్యాహ్నం కాఫీ తాగిలి అనుకునే వారు అది విరమించుకోవడం చాలా ఉత్తమం.




# అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు..




ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు అందుకుంటూ స్టార్ హీరోల సరసన నటిస్తూ క్రేజీ బ్యూటీగా దూసుకుపోతున్న మాళవిక మోహనన్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ దళపతిపై ప్రశంసలు కురిపించింది. వీరిద్దరు కలిసి నటించిన 'మాస్టర్' సినిమా షూటింగ్ మేమోరీస్ పంచుకుంటూ.. 'మాస్టర్ సినిమా ఫస్ట్ డే షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చి నా ఫోకస్ మొత్తం డైలాగ్స్ పైనే పెట్టాను. కానీ విజయ్ మాత్రం ఎలాంటి కష్టమైన్ సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా కూల్‌గా ప్రతి విషయంపై ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. అంతేకాదు.. ఎప్పుడు ఏ అవసరం వచ్చిన ఫోన్ చేయగలిగే స్వేచ్ఛను ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండటం చాలా గొప్ప విషయం' అని చెప్పకొచ్చింది. అలాగే తను నటించిన స్టార్స్ గురించి మాట్లాడుతూ.. 'మోహన్ లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ స్టార్ నటుల సినిమాల్లో నటించడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. ఉదయం 7 గంటలకు షూటింగ్ అంటే వాళ్లు 6:55 సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు'

# రామ్ పోతినేని మూవీలో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ ఫిక్స్!

సింగర్‌గా, గేయరచయితగా, హీరోగా తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకున్న యంగ్ నటుడు రామ్ పోతినేని.. ఇప్పుడు డైరెక్టర్‌గా కొత్త అవతారం ఎత్తేందుకు సిద్ధం అయ్యాడు. తన 23వ సినిమాకు తానే స్వయంగా దర్శకత్వం వహిస్తున్నట్లు తాజాగా తన బర్త్‌డే సందర్భంగా అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. 'RAPO23' గా తెరకెక్కుతోన్న ఈ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌ను 'రాపో సినిమాటిక్స్' బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్నారు. ఇందులో రామ్ 'వీర' అనే పాత్రలో కనిపించనుండగా.. లెదర్ జాకెట్‌తో వెనకవైపు నిలబడి ఉన్న లుక్‌ను షేర్ చేసి సినిమాపై క్యూరియాసిటీని పెంచారు మేకర్స్. 'ఒంటరి తోడేలు కథ ఇది' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతోన్న ఈ సినిమాకు సంబంధించిన హీరోయిన్‌పై ఇంట్రెస్టింగ్ బజ్ వినిపిస్తుంది. ఇందులో రామ్ సరసన ఫీమేల్ లీడ్ కోసం యంగ్ బ్యూటీ శ్రీనిధి శెట్టిని ఫిక్స్ చెయ్యాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. మాక్సిమమ్ ఈ బ్యూటీనే ఫిక్స్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. ఇది కన్ఫర్మ్ కాకపోతే సెకండ్ చాయిస్‌గా సంయుక్త మీనన్ పేరు కూడా పరిశీలిస్తున్నట్లు ఫిలిమ్ వర్గాల నుంచి సమాచారం.





# రూ.12 కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన త్రిష.. అందుకేనా!

వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హాసన్ - రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె (Trisha) సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి.

కమల్ హాసన్ - రజనీకాంత్ (Rajinikanth) 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ సినిమా కోసం ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి.

# అతిథిగా జాక్వెలిన్ మెరుపులు?

వైవిధ్యమైన పాత్రలతో ప్రయాణం చేసే కథా నాయిక యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'నయీ నవేలి'. బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ప్రత్యేక పాత్రలో కనువిందు చేయనున్నట్లు సమాచారం. "జాక్వెలిన్ ఇందులో అతిథిగా కనిపించినా.. ఆమె పాత్ర కథాంశానికి కీలకంగా ఉండనుంది. ప్రస్తుతం ఈ విషయాన్ని చిత్రబృందం గోప్యంగా ఉంచుతున్నప్పటికీ.. ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను పూర్తి చేసిందామె. ఇంతక ముందు జాక్వెలిన్, యామి.. 'భూత్ పోలీస్' చిత్రంలో కలిసి నటించారు" అని బాలీవుడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. జానపద కథల నుంచి ప్రేరణ పొందిన హారర్ కామెడీగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆనంద్ ఎల్.రాయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మరి ప్రత్యేక పాటలతో అలరించే జాక్వెలిన్.. ఈసారి అతిథిగా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



# నార్త్ అమెరికాలో సరికొత్త రికార్డు దిశగా 'పెద్ది'

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రానికి సంబంధించిన నార్త్ అమెరికా ప్రీమియర్ బుకింగ్స్ ఇప్పటికే ఓపెన్ అయ్యాయి. బుకింగ్స్ ప్రారంభమైన నాటి నుంచే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తుంది. తాజాగా ఈ మూవీ యూనిట్ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు నార్త్ అమెరికా ప్రీమియర్స్‌కు సంబంధించిన 10 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుండగా, ప్రీమియర్ షోలను జూన్ 3న ప్రదర్శించనున్నారు.
విడుదల తేదీకి ఇంకా సమయం ఉండటంతో పాటు, ఈ మూవీ ట్రైలర్ కూడా ఇంకా విడుదల కాలేదు. ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటే టికెట్ సేల్స్ మరింత పెరిగే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ట్రైలర్ అంచనాలకు మించి ఆకట్టుకుంటే నార్త్ అమెరికాలో 'పెద్ది' ప్రీమియర్ బుకింగ్స్ సరికొత్త రికార్డులను సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటించింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించారు.



# సూర్య 'వీర భద్రుడు' ఓటీటీ లాక్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..!

నటుడు - దర్శకుడు ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన 'వీరభద్రుడు' సినిమాపై మొదటి నుండి భారీ అంచనాలు ఉన్నాయి. విడుదల రోజున కొన్ని ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉదయం షోలు క్యాన్సిల్ అయినప్పటికీ, వన్స్ థియేటర్లలో బొమ్మ పడగానే సూర్య మాస్ రాంపేజ్‌కు ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఆర్‌జే బాలాజీ మార్క్ స్క్రీన్‌ప్లే, సూర్య ఇంటెన్స్ యాక్టింగ్, చాలా ఏళ్ల తర్వాత స్క్రీన్ షేర్ చేసుకున్న సూర్యత్రిషల వింటేజ్ కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి.
దీనికి తోడు యువ సంచలనం సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (BGM) థియేటర్లను ఊపేస్తోంది. మొదటి రోజే ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా భారీ వసూళ్లను సాధించి సూర్య కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ డిజిటల్ రైట్స్‌ను ప్రముఖ ఓటీటీ సంస్థ భారీ ధరకు కైవసం చేసుకుంది.
లేటెస్ట్ సమాచారం ప్రకారం, 'వీరభద్రుడు' (కరుప్పు) చిత్రానికి సంబంధించిన పోస్ట్‌థియేట్రికల్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ గ్లోబల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో (Amazon Prime Video) సొంతం చేసుకుంది. కాగా థియేటర్లలో విజయవంతంగా రన్ ముగిసిన తర్వాత (దాదాపు 4 నుండి 6 వారాల విండో తర్వాత) ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల్లో ప్రైమ్ విడియోలో అందుబాటులోకి రానుంది. ఈ సినిమా థియేట్రికల్ రెస్పాన్స్ మైండ్ బ్లోయింగ్ గా ఉండటంతో ఓటీటీ లో కూడా డిజిటల్ ప్రీమియర్‌కు సాలిడ్ వ్యూస్ రావడం ఖాయామనిపిస్తోంది.




# 'వృషకర్మ' నుంచి షూటింగ్ అప్డేట్.. హీరో, హీరోయిన్ క్యూట్ ఫొటోస్ వైరల్

అక్కినేని హీరో నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వృషకర్మ'. 'తండేల్' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత చైతు నుంచి వస్తున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అంతే కాకుండా 'విరుపాక్ష' చిత్రంతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో సినిమా నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా వృషకర్మ షూటింగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్.



ఈ మేరకు.. 'వృషకర్మ టీమ్ రాజస్థాన్‌లో కీలక షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారతీయ ప్రేక్షకులకు ఇంతకుముందెన్నడూ చూడని మైథాలజికల్ థ్రిల్లర్‌ను అందించేందుకు భారీ స్థాయిలో CGI వర్క్స్ జరుగుతున్నాయి. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే' అంటూ కొన్ని క్యూట్ పిక్స్ షేర్ చేశారు. ఇందులో షూటింగ్‌కు సంబంధించిన ఫొటోలతో పాటు హీరో నాగచైతన్య, హీరోయిన్ మీనాక్షి చౌదరి లుక్స్ అందరిని ఆకట్టుకుంటున్నాయి. కాగా.. ఈ భారీ మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా.. స్పర్శ శ్రీవాత్సవ విలన్‌గా కనిపించనున్నాడు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర (SVCC), సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నాడు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.